క్లుప్తంగా

మదర్‌థెరిస్సా సేవలు స్ఫూర్తిదాయకం



భవానీపురం(విజయవాడపశ్చిమ): మదర్‌థెరిస్సా అందించిన సేవలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని 43వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి అన్నారు. మదర్స్ విజన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని మోహన్‌లాల్ చంద్ర బాగ సాబూ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో మదర్‌థెరిస్సా జయంతిని నిర్వహించారు. మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవచేయడంలోనే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు మదర్ థెరిస్సా అని కొనియాడారు. మదర్ థెరిసా సంస్థ కమిటీ సభ్యులు మోహన్‌రావు, భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ సీఐ గోపాలకృష్ణ, వర్మ, పాఠశాల హెచ్‌ఎం మొహమ్మద్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎస్‌సీఎంఆర్ కాలేజ్‌లో చవితి వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో వినాయక చవితిని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ రహిత విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. వివిధ రకాల గణపతి విగ్రహాలను, గణపతి నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, సైకాలజిస్ట్ డాక్టర్ నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.


దాడి ఘటనపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చెల్లెలి కాపురం గురించి అడిగేందుకు వెళితే దాడి చేసిన ఘటన భవానీపురం రంగూన్ సాహెబ్ వీధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... పంజా సెంటర్‌కు చెందిన ఎస్కే రహమాన్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన చెల్లి ఎస్కే జహేదాను భవానీపురం రంగూన్‌సాహెబ్ వీధికి చెందిన అబ్దుల్ రహమాన్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. కొంత కాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె తన అన్న ఇంటి వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో తన చెల్లిని తీసుకొని ఆటోలో భావ అబ్దుల్ రహమాన్ ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ ఆటోలో కూర్చుని ఉండగా.. అతనిని బయటకు లాగి కర్రతో దాడి చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.


రంగా విగ్రహాన్ని అవమానపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల ఏలూరు జిల్లా కలిదిండిలో దివంగత ఎమ్మెల్యే, కాపునేత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పేడ పూసి అవమానపరచిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు డిమాండ్ చేశారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత వంగవీటి మోహన్‌రంగా చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అంజిబాబు మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా అందరివాడని, అటువంటి మహనీయుని విగ్రహానికి పేడ పూసి అవమానపరచడం సరికాదన్నారు. ఇటువంటి దుశ్చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకుడు పోతిన మహేష్, చెన్నుపాటి శ్రీనివాస్, మా ఆర్ట్స్ అధినేత చంటి, అత్తులూరి జస్వంత్ కుమార్, ఆకుల శ్రీనివాస్ కుమార్, చలమల శెట్టి శ్రీనివాస్, ముళ్ళపూడి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, రంగా అభిమానులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం



పూజారి వారివీధిలో అద్దాల గణపతి



కోమలవిలాస్ సెంటర్‌లో..



సమ్మెటవారివీధిలో మట్టి విగ్రహం



వస్త్రలతలో విఘ్నేశ్వరుడు

- పశ్చిమంలో కొలువుదీరిన భారీ గణనాథులు
- వీధివీధినా పండుగ శోభ
- విద్యుత్ వెలుగులో సందడి చేస్తున్న మార్కెట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో భారీ గణనాథులు కొలువుదీరారు. గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే వినాయకచవితి ఉత్సవాలకు వన్‌టౌన్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వినాయక ఉత్సవాన్ని వన్‌టౌన్ వాసులు ఘనంగా జరుపుకుంటారు. తొలి పూజను అందుకునే గణనాథుడు తమకు అన్ని వేళలా అండగా ఉండాలని వ్యాపార సంఘాలు, మిత్రబృందాలు, వివిధ సమూహాలు వన్‌టౌన్‌లోని వీధివీధినా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా వచ్చే ఆనవాయితీని విస్మరించకుండా ఈ ఏడాది గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఆయా సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉత్సవాల నిర్వహణలో గడిచిన రెండున్నర దశాబ్దాల్లో పోటాపోటీగా ఈ ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎక్కడా రాజీ పడకుండా ఉత్సవాలను నిర్వహించడం తమకు మరింత ఆనందాన్ని కలిగిస్తుందని వారు చెబుతున్నారు.

వివిధ రూపాల్లో గణనాథులు

వన్‌టౌన్‌లో అడుగు నుంచి 14 అడుగుల మేర గణనాధుని విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కొన్ని ప్రత్యేక తలతో కూడిన విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ప్రతి విగ్రహం చూడముచ్చటగా భక్తులకు కనువిందు చేస్తుంది. సమ్మెటవారివీధి, కందులవారివీధి, పూలబావివీధి తదితర ప్రాంతాల్లో చూడముచ్చటగా ఉన్న గణనాథులను ఏర్పాటు చేశారు. అలాగే వస్త్రలత, కోమలవిలాస్ సెంటర్ తదితర ప్రాంతాల్లోనూ భారీగానే ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వాటితో పాటుగా కలకత్తా, ముంబాయి ప్రాంత సంప్రదాయాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో తయారైన బొజ్జగణపయ్య విగ్రహాలు వన్‌టౌన్‌లో ఆయా పందిళ్లలో కొలువుదీరాయి. బుధవారం ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. అలాగే ప్రత్యేకంగా భక్తులను ఆకర్షించేందుకు వివిధ రీతుల్లో విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలు

వన్‌టౌన్‌లో ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు భారీగానే ఖర్చు చేస్తున్నారు. గణనాథుని విగ్రహాలకు తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు చేస్తారు. నగరంలో కొనుగోలు చేసి తీసుకొచ్చే విగ్రహాల విషయాన్ని పక్కన పెడితే బయట ప్రాంతాల నుంచి తీసుకొచ్చే విగ్రహాలు విశేష అలంకరణలో ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఇరవై వేల నుంచి రూ.లక్షకు పైగా వ్యయం చేసి విగ్రహాలను కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. భారీ గణనాథుల విగ్రహాల చుట్టూ ప్రత్యేక అలంకరణ, ఇతర సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



భవానీపురంలో మట్టి వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

పోటెత్తిన పూల మార్కెట్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పూల ధరలకు రెక్కలొచ్చాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో పూల ధరలు మంగళవారం అమాంతం పైకెక్కి కూర్చున్నాయి. బొజ్జ గణపయ్యకు పూలతో అలంకరించి ఘనంగా పూజ చేయాలని భావించిన నగర వాసులకు వాటి ధరలు కళ్లు బైర్లు కమ్మేటట్లు చేస్తున్నాయి. పూల దిగుబడి కన్నా వాటి డిమాండ్ అధికంగా ఉండటంతో రైతులు సైతం అమాంతం ధరలు పెంచారని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో అత్యధికంగా కనకాంబరాల ధరలు వెయ్యి రూపాయాలకు పైగా విక్రయించారు. అలాగే మల్లెపూలు సైతం అదే ధరకు విక్రయిస్తున్నారు. ఉదయం వీటి ధరలు ఎనిమిది వందలే పలికింది. కానీ సాయంత్రానికి కనకాంబరాల ధర 1,500 చేరిందని వ్యాపారులు తెలిపారు. సన్నజాజులు కిలో రూ.1200 చొప్పున విక్రయించారు. వీటి ధరలు కూడా రెండు రోజుల్లో రెట్టింపు అయాయి. చామంతులు, హైబ్రిడ్ గులాబీ కిలో రూ.600, బంతి పూలు రూ.200 విక్రయించారు. పూల దండల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ముఖ్యంగా నిత్యం రూ.1000లకు విక్రయించే దండ మంగళవారం రూ.5000 పలికింది. గజమాల రూ.15 వేల వరకూ పలికాయి. మంగళవారం ఉదయం నుంచే రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ పూల మార్కెట్ కిక్కిరిసి కనిపించింది. మార్కెట్‌లో అడుగుతీసి అడుగు వేయడానికి కూడా ఖాళీ లేని పరిస్థితి దర్శనమిచ్చింది. ఒకరిపై ఒకరు తోసుకుంటూ ముందుకు సాగారు. అంతేకాకుండా రాజీవ్‌గాంధీ పూల మార్కెట్ చుట్టూ వినియోగదారుల రద్దీతో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. మంగళవారం భారీ వాహనాలను వీఎంసీ కార్యాలయం వద్దనే నిలిపివేసి ద్విచక్ర వాహనాలను ఆ రోడ్డులోకి అనుమతించారు.



ఉచిత మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



కనకదుర్గానగర్‌లో ప్రతిమలు అందజేస్తున్న ఈఓ శీనా నాయక్



ప్రతిమలు అందజేస్తున్న సహస్ర బ్యాంక్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా వన్ ఎర్త్ వన్ లైఫ్ (టెర్రస్ గార్డెన్ గ్రూప్) వారు ఉచిత మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్ ఎర్త్ వన్ లైఫ్ సంస్థ పర్యావరణ పరిరక్షణ దిశగా చేస్తున్న సేవలను ప్రశంసించారు. సంస్థ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో 520 మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి, వాటిని సబ్ కలెక్టర్, కలెక్టర్ కార్యాలయంలో ఉచితంగా పంపిణీ చేసింది. కార్యక్రమంలో అడ్మిన్ లీలా కుమారి ఏలూరి, మద్దిరాల కమలాకరరావు, తిరునవల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

కనకదుర్గానగర్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పండుగ సందర్భంగా ఇంద్రకీలాద్రి దిగువ నున్న కనకదుర్గానగర్‌లో కలవకల్లు దుర్గారావు అనిల్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మంగళవారం వినాయకుని మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీకె శీనా నాయక్ పాల్గొని ప్రతిమలను ప్రజలకు అందజేశారు. శ్రీశబరిమల అయ్యప్ప సేవా సమాజం, సద్గురు సత్సంగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయకుని ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. చిట్టినగర్ లంబాడీపేటలోని ఫైర్ స్టేషన్ వద్ద జరిగిన ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు. శ్రీశబరిమల అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయి మాట్లాడుతూ గత 10 ఏళ్లగా వినాయకుని మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంకా శ్రీనివాసరావు, వక్కలగడ్డ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట బ్రాహ్మణ వీధిలో శ్రీసహస్ర కోఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు దేవర సురేష్ తదితరులు విగ్రహాల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు పులి శ్రీనివాసరావు, పులిపాటి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వినాయక నిమజ్జన ఏర్పాట్లు



కృష్ణానది వద్ద నిమజ్జన పాయింట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వినాయక చతుర్థి అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమల నిమజ్జన ఏర్పాట్లు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జరగాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం సీతమ్మ వారి పాదాలు, వన్‌టౌన్, ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, ఎం.జి రోడ్డు, ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ వినాయకుని పెద్ద విగ్రహాలను సీతమ్మ వారి పాదాల వద్ద గతంలో నిమజ్జనం చేసిన ప్రాంతంలోనే చేయాలని, చిన్న విగ్రహాల కోసం ప్రత్యేకంగా ట్యాంకర్ ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. కాలువల వద్ద నిమజ్జనం చేసే ప్రజలకు కేవలం వినాయకుని ప్రతిమ మాత్రమే కాలువలో నిమజ్జనం చేయాలని, ఆకులు పూలను ప్రత్యేకమైన బిన్లలో వాటిని వేసి వీఎంసీ సిబ్బందికి సహకరించాలని అన్నారు. బిన్లలో వచ్చే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు నగరపాలక సంస్థ వారికి సహకరించి పెద్ద విగ్రహాలను నగరంలో ఎక్కడా నిమజ్జనం చేయకుండా కేవలం సీతమ్మ వారి పాదాల వద్ద వీఎంసీ ఏర్పాటు చేసిన పాయింట్లోనే నిమజ్జనం చేయాలని, చిన్న విగ్రహాలతో తీసుకొచ్చే పూల వ్యర్థాలను నగరపాలక సంస్థ వారికి అందించాలని కోరారు. ప్రజలందరూ పర్యావరణహితమైన వినాయకుడిని వాడి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాసరెడ్డి, జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్, జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చేస్తున్న ఏర్పాట్లను దుర్గగుడి కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ మంగళవారం పరిశీలించారు. ఘాట్ రోడ్‌లో బైక్, కారు పార్కింగ్ ప్రాంతాలను తనిఖీ చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా వాహనాలను క్యూలో ఉంచాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. మొబైల్ ఫోన్‌లను భద్రపరిచేందుకు రెండు కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వీఐపీలకు రిసెప్షన్ పక్కన ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కనకదుర్గానగర్ ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న బీటీ రోడ్ పనుల పురోగతి, నాణ్యతను ఈఓ తనిఖీ చేశారు. దసరా సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించే వేదికను కనకదుర్గానగర్ ఎగ్జిట్ పాయింట్ (ఎలివేటెడ్ క్యూ ప్రాంతం) వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నూతన టెక్నాలజీ వినియోగం, వివిధ టికెట్ కౌంటర్ల ఏర్పాటు కోసం తీసుకోవల్సిన ప్రణాళికపై 9 అండ్ 9 సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కార్యనిర్వహక ఇంజినీర్ రాంబాబు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఏఈఓ గంగాధర్ పాల్గొన్నారు.

పర్యావరణహిత వినాయక ప్రతిమల ప్రదర్శన



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు రోటరాక్ట్ క్లబ్ పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు మట్టి వినాయకుని ప్రతిమలను తయారు చేయటంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు వివిధ రూపాలు, ఆకృతుల్లో తయారు చేసిన మట్టి ప్రతిమలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వీవీ రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరాక్ట్ క్లబ్ ప్రతినిధులు ఎస్.దేవి శశాంక్, సి.హరి, గణ సాయి, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

- 29న పిన్నమనేని సిద్ధార్థలో వర్క్‌షాప్

గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈ నెల 29వ తేదీన డిపార్టుమెంట్ ఆఫ్ పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు కళాశాలలో మంగళవారం బ్రోచర్ ఆవిష్కరించారు.

మానవ సేవే.. మాధవ సేవ



దుప్పట్లు అందజేస్తున్న హజరత్తయ్య గుప్తా తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మానవ సేవే మాధవ సేవ అని వాసవీ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. హెల్ప్ ది హోప్ లెస్ సంస్థ 25వ వార్షికోత్సవాన్ని చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ఆసరా లేని వారిని అక్కున చేర్చుకుని స్వాంతన చేకూర్చ గలిగితే పుణ్య ప్రాప్తి పొందుతారన్నారు. ఆ క్రమంలో హెల్ప్ ది హోప్ లెస్ సంస్థ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని ముందుకు సాగటం అభినందనీయమన్నారు. సంస్థ సేవలను మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, ఉమ్మడి వెంకటేశ్వరరావు, టీడీపీ నగర కార్యదర్శి దేవతోటి నాగరాజు తదితరులు మాట్లాడుతూ సంస్థ ఆశ్రమ నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. గుర్రం వెంకటేశ్వరరావు (కొండ), బొబ్బిలి లీలాకుమార్, పల్లెపోగు ప్రసాద్, బేబీ రత్నకుమారి పాల్గొన్నారు. వేడుకలను అన్నపూర్ణ, బాయన శేఖర్‌బాబు, ఈదులూరి రాధాకృష్ణ పర్యవేక్షించారు.

31న యోగా పోటీలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఈ నెల 31వ తేదీ ఆదివారం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో యోగా పోటీలను నిర్వహిస్తున్నామని కృష్ణా డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ స్థాయిలో బాల బాలికలకు, సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఈ నెల 30వ తేదీ శనివారం ఉదయం 11 గంటలలోపు 94411 19909, 94402 76648 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com

గౌరవనీయ కుటుంబ న్యాయాధికారి వారి న్యాయస్థానం, విశాఖపట్నం
F.C.O.P NO 1058/2024
ఈ దిగువ వారి మధ్యన:
పైడి సంతోష్ ...వాది
మరియు
పైడి సాయితులసి ...ప్రతివాది
ప్రతివాదికి నోటీసు
టు:
ప్రతివాది: శ్రీమతి పైడి సాయితులసి, D/o ఆకుల కృష్ణ, వయస్సు: 29 సంవత్సరాలు, డోర్ నెం. 4-2/4-2A/23C, ఈద్ది మహాల అడ్డరోడ్డు, వాగు సెంటర్, కొత్తపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
పైన తెలిపిన వారి దాంపత్య హక్కులు మరియు ఇతర ఉపశమనములు పునరుద్ధరించవలసినదిగా కోరుతూ దావా దాఖలు చేసినారు. సదరు దావా మీరు స్వయంగా లేదా అడ్వకేట్ వారి ద్వారా హాజరు నిమిత్తం **తేది 11.09.2025 ఉదయం 10.30 గంటలకు** వాయిదా అయి ఉన్నది. అట్లు హాజరుకానిచో గౌరవ న్యాయస్థానం వారు మీ పరోక్షమున సదరు విషయం విచారణ జరిపి నిర్ణయిస్తారని దయచేసి గమనించగలరు.
(న్యాయస్థానం వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎస్.వెంకట రమణ, P.A. రావు (రాజు),
అడ్వకేట్స్
ప్లాట్ నెం. 301, వర్ణా రెసిడెన్సీ-1, చాణక్యనగర్, చినముషిడివాడ, పెందుర్తి మండలం, విశాఖపట్నం-73, సెల్ నెం. 85010 57554.

సందడిగా నగర మార్కెట్లు

- జోరుగా పత్రి, పండ్లు, గణేష్ విగ్రహాల విక్రయాలు
- కిక్కిరిసిన మార్కెట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని నగరంలో మార్కెట్లు మంగళవారం సందడిగా కనిపించాయి. చవితి వేడుకలను పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని వివిధ కూడళ్లు కొనుగోలుదారులతో కళకళలాడుతూ దర్శనమిస్తున్నాయి. సాధారణంగా పండుగ ముందు రోజు సాయంత్రం సందడిగా మార్కెట్లు దర్శనమిస్తాయి. కానీ గతంతో పోల్చి చూస్తే గ్రామాల నుంచి వచ్చే చిరు వ్యాపారులు నామమాత్రంగా నగరానికి వచ్చారు. అయినా నగరంలోని మార్కెట్లన్నీ సందడిగా మారాయి. గణపతి పూజకు అవసరమయ్యే పత్రి, వివిధ రకాల పూజా సామగ్రి, వినాయకుని విగ్రహాలు, మట్టి విగ్రహాల తయారీదారులు, గొడుగులను ప్రజలు కొనుగోలు చేశారు. ముఖ్యంగా కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ వ్యాపారులతో పూర్తిగా నిండిపోయింది. హెడ్‌పోస్టాఫీస్, వస్త్రలత, కాళేశ్వరరావు మార్కెట్ కాంప్లెక్స్ భవనాల చుట్టూ ప్రాంతాన్ని వ్యాపారులు ఆక్రమించుకొని పత్రి ఇతర పూజాసామగ్రిలను విక్రయించారు. శివాలయం వీధి సైతం వ్యాపారులతో నిండిపోయింది. కొత్తపేటలోని గణపతిరావురోడ్డు తదితర ప్రాంతాలు సైతం సందడిగా కనిపించాయి.

పూజా సామగ్రికి రెక్కలు

సాధారణంగా పత్రి, వినాయకుని విగ్రహం, గొడుగు, మొక్కజొన్న కండెలు, వెలగకాయలు, కొబ్బరికాయ, పాళవెల్లి, పూలు తదితర పూజా సామగ్రికి గతంలో రూ.100 నుంచి రూ.200 వెచ్చిస్తే సరిపోయేది. కానీ ఈసారి పూజా సామగ్రి మొత్తం కొనుగోలు చేయాలంటే రూ.400 నుంచి రూ.500 వెచ్చించాల్సి వచ్చిందని కొనుగోలుదారులు తెలిపారు. బంతిపువ్వులు, మామిడి ఆకుల ధరలను కూడా అమాంతం పెంచేశారు.

ట్రాఫిక్‌కు ఆటంకం..

వన్‌టౌన్‌లోని పత్రి, ఇతర పూజాసామగ్రి విక్రయాలతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా కేజీ మార్కెట్ సెంటర్‌లో బస్సుల రాకపోకల్లో తీవ్ర జాప్యం ఏర్పడిందని బస్సు డ్రైవర్లు తెలిపారు. అదేవిధంగా సామారంగంచౌక్, శివాలయంవీధి, మొయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో కూడా వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి.



కేజీ మార్కెట్ వద్ద పూజా సామగ్రి విక్రయిస్తున్న వ్యాపారులు



గణపతి ఉత్సవాలకు సిద్ధమైన కెనాల్‌రోడ్డు వినాయకుడు దేవస్థానం